పి.వి.బి. శ్రీరామమూర్తి

# బుల్లితెర పాఠాలు



వెళిపోతూ, వెళిపోతూ సందులోకి చూసాడు కానిస్టేబిలు కనకారావు.

వీధి మొదట్లో జనం... గుంపులు గుంపులుగా కనిపించారు.

'నాకెందుకులే.... పోదాం!' అనుకునే రకం కాకపోవటం వల్ల సైకిలు సందులోనికి తిప్పాడు. ఏవన్నా మర్డరా?... గేస్ సిలిండర్ పేలిందా.....? కేడీనాకొడుకెవుడయినా దొరికిపోండా?... ఈది కొట్లాటా?

అసలేటయింది?

ఏదయినా తన బీటూ... తన రూటూ!

ఎళ్తే తప్పేముంది?

అసలే ప్రమోషన్ లిస్టులో ఉన్నాడూ!

అనుకున్నట్లే వెళ్ళాడు.

ఇంటినిండా ఆడాళ్ళే! ఒకళ్లో, ఇద్దరో మగాళ్ళున్నారంతే!

"ఏటయింది?... తప్పుకోండెహె!" అని జనాన్ని విదిలిస్తూ... అడ్డంగా వచ్చినాళ్ళని వక్కకి నెడుతూ... ముందుకు దూసుకుపోయాడు బాణంలా!

అక్కడందరూ బిక్కచచ్చిపోయారు.

కనకారావేమడిగినా అందరూ మవునంగానే ఉండి పోయారు.

తాపీగా తెలునుకున్న విషయమేమంటే...

"ఏయ్! నిన్నే... ఏంటలా ముంగిలా చూస్తునిలబడ్డావ్ టైం ఎంతయిందో తెలుసా!"

ఊహూ... తెలీదు మీలాగ నేను డిగ్రీ కాదుగా, పీ.జీ. మాత్రమే చేసాను. టైం చూడ్డం నాకేం తెలుస్తుందీ?" లోకనాధం ప్రశ్నకి

లోకేశ్వరి జవాబు.

దాంతో లోకనాథంకి దిమ్మెత్తింది.

"అంటే!.. నేను నీకంటే తక్కువనా నీ ఉద్దేశ్యం?"

"ఓ యబ్బో! తక్కువెందుకనుకుంటాను. ఎత్తులోనూ, బరువలోనూ, తిండిలోనూ అన్నింటా ఎక్కువే!" పెదవి విరుస్తూ అంది లోకేశ్వరి.

"అంటే.. నేను తిండిపోతునీ... బుద్ధిలేని వాణ్ణనేగా నీ ఉద్దేశం?"

"నా మాటల్లో మీకా అర్ధం వచ్చిందా? పుచ్చకాయలదొంగంటే భుజాలు తడుపుకున్నాట్ట వెనకటికెవడో?! అయినా 'బుద్ధిమాలిన వాడని' ఏ పతిదేవుణ్ణయినా... ఈ హిందూ దేశంలో సతీమణులనగలరా?"

"నువ్వంటున్నావుగా!"

"అవ్వ?! ఎంత మాట. అపచారం, అపచారం! ఎంత ఉన్నమాటయినా అంత ధైర్యంగా అనగలిగే ఖలేజా నాకెక్కడి దండోయ్!" మూతి మూడు వంకరలు తిప్పుతూ అంది లోకేశ్వరి.

"అసలు నీకేమయిందివాళ? మీ అమ్మ అనమందా? నీ బాబనమన్నాడు? నీ యక్కనమందా? అసలేమిటి కథ?" మిక్సీలో వేసిన వేపిన కందిపప్పులా పట పట మన్నాడు.

"ఇదిగో..... మీకే చెప్తున్నాను. ఇది రెండోసారి! మాది సంప్రదాయ కుటుంబం! రావుబహుద్దూర్ విశ్వనాథంగారమ్మాయిని. మొదట్నించీ ఎడ్యుకేటెడ్ ఫామిలీ! మీకు తెలీదేమో. మా తాతమ్మ... ఆరోజుల్లో ఎం.ఏ.లిట్ ఆంగ్లాంధ్రాలు. నామలింగాను శాసనం ఔపోసన పట్టింది. మీకు తెలుసో తెలీదో.. బమ్మెరపోతన పద్యాల్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేసింది. తల్లికొంగు పట్టుకుని, బొటన వేలు చీకుతూ.. నంగినంగిగా తిరగటానికి నేనేం నర్వేశ్వరరావు కూతుర్నీ కాదు, లోకనాథంనీ కాదు. మా నాన్న ఆడపిల్లనైనా.... రుద్రమదేవివిలా పెంచాడు. మాటలు జాగర్తగా రానీ?" అని కొంగు మొల్లో దోపింది ఏకవచనంలోకి మారుతూ.

"ఏంటినీ తలబిరుసు? పళ్లూడగొట్టానంటే వెళ్లి మీ అమ్మమ్మ పక్కన పడి వక్కపొడి, చెక్కిడాలు పొడిచేసుకొని నవుల్తూ కూచోగలవ్ బోడి పీ.జీ అఫ్ట్రాల్ హిందీ ఎమ్.ఏ గ్రేడ్ టూ పోస్టు కూడా సంపాదించలేకపోయావు"

"అదే... మరదే... ఎక్స్ట్రా.... నేం తల్చుకుంటే లెక్చరర్నే అయి ఉండేదాన్ని లక్షలు కట్నం.... పదిహేను తులాల బంగారం. మూడు కేజీల వెండి. మీ బాబు చేతిలో పోసి.. ఎండనకా... వాననక... అలిసి.. తడిసి.... నేనెందుకుజ్జోగం చెయ్యాలి. అందుకే - నీ బాధ భరించలేక పరీక్ష రాసా గాని.... మనస్ఫూర్తిగా రాయలేదు. రాసుంటే నేనే కాదు... నా తల్లో పేను, ఈను కూడా ఆ బోడి టెస్టు పాసయి ఉండేది!" అంది.

"ఓసి నీ యమ్మకడుపుమాడ! నీ కడుపులో ఇంత కుళ్ళుందంటే... ఇక నిన్ను బతక నివ్వను. ఏ రోజో గేస్ ఆన్ చేసి... నీ పని పట్టేస్తాను" అని బొబ్బిలి కోడి పుంజులా మీదకి లేస్తున్న లోకనాథాన్ని అంతకు అంత గంట క్రింతం టీ పొడి ఎరువుకోసం వచ్చిన కామాక్షమ్మ అటకాయించింది.

"అన్నయ్యగారూ! ఇన్నాళ్ళూ మీ దెంతో ఆదర్శదాంపత్యం అని వీధులో అందరూ అనుకునే వాళ్ళం! ఇప్పుడివాళేమయింది? మీలో మీకిన్ని విభేదాలున్నాయని... ఎవ్వరం అనుకోలేదు. వదినగారు తప్పుచేస్తే క్షమించాలి పెద్ద మనసుతో" అంటున్న కామాక్షి మాటలకి లోకేశ్వరి, లోకనాథం విరగబడి నవ్వుతూ చప్పట్లు కొట్టారు.

"అయితే ప్రయిజు మాదే!" అన్నారు.

"చెల్లమ్మా అంత నేచురల్గా ఉందా నా

నటన?" అన్నాడు లోకనాథం.

"నటనా? ఇప్పుడాశ్చర్యపోవటం కామాక్షి వొంతయింది. కామాక్షి తల తిరిగి పోయింది. అప్పుడంతా వివరంగా చెప్పింది లోకేశ్వరి. ఏదో టీవీ వాళ్ళు 'మొగుడు..... పెళ్ళాలు' ఎంత రసవత్తరంగా తగూలాడుకుంటే... అంత మంచి బహుమానం ఇస్తామని పోటీలు పెట్టారట. దానికోసం ఇవి రిహార్సల్సట!

పొంగుతున్న పాలుమీద, నీళ్ళు పోసినట్లు... రగుల్తున్న నిప్పుమీద నీళ్ళు చల్లినట్టు డిసప్పాయింట్ అయి కామాక్షి వెనుదిరిగింది వచ్చినపని కూడా మరచి!

ఇది జరిగి ఓ నెలరోజులయింది.

అనుకున్నట్లే లోకనాథం దంపతులకు మెమెంటో బహుమతి వచ్చాయి. అందరూ అభినందించారు.

ఓరోజు ఆఫీసు నుండి వచ్చిన లోకనాథం భార్య టీవీ చూస్తూ తనని గమనించకపోవటంతో లుంగి మార్చుకుని.... బాత్రూంకెళ్ళి వచ్చాడు. ఆ తరువాత చూస్తున్న సీరియల్ మధ్యలో బ్రేక్ రావటం... తర్వాత ప్రక్కకి తిప్పటంతో...

"అరగంటయింది. నేను డ్రెస్ ఛేంజ్ చేసుకుని వచ్చి .... వచ్చాక.... ఇప్పుడా గమనించావ్?"

"సారీ అండి" అంది గోముగా.

ఆఫీసులో జరిగిన సంఘటన మనసుని చెల్లాచెదురు చేయటంతో... "మరీ అంత సీరియస్‌నెస్ వనికిరాదు. నేనయింది సరిపోయింది. అదే ఏ దొంగ వెధవ అయితే... ఏమయి ఉండేది?" అన్నాడు. సీరియస్‌గా.

అంటే.... నేనెంత ఒంటి మీద తెలివి లేకుండా ఉన్నానా? ఇవాళ కొంచెం సస్పెన్స్‌గా ఉండటంతో... వెళ్ళేది వనిమనిషేమో అనుకున్నాను." అంది పొరపాటుగా. "అంటే.... నీ కంత హీనంగా కనిపిస్తున్నానా? ఇవాళాఫీసులో బాసుగాడూ అంతే... నేను అర్థగంట ముందెళ్తే అర్థగంట ఆలస్యంగా వెళ్ళానని ఎటెండెన్స్ రిజిష్టర్‌లో కొశ్చన్ మార్కేసాడు. పైగా అతను రావటం నేను చూసి కూడా గమనించక తల పక్కకి తిప్పి.. టైపిస్ట్‌తో మాట్లాడుతున్నానని అపనిందొకటీ! వాడు చప్పిడి ముక్కు గౌడుగేదెలా నల్లగా నిగనిగలాడిపోతుంటాడు. దానికితోడు స్నఫ్ కలర్ సఫారీ డ్రెస్సూ.... బ్లాక్ షూ...వాడ్ని చూసి భాను ప్రియలాటి ఆ టైపిస్ట్... వాణ్ణి వలచీ లేదట.... ఇవాళెవరి ముఖం చూసానో... రోజంతా ఇలా ఏడిచింది?"

"అవున్లెండి ఇన్నాళ్ళకి మీ బాగోతం రచ్చకెక్కింది. ఆ టైపిస్ట్ మీకు భానుప్రియ అయిపోయింది. తెల్లారి లేస్తూనే మీకు బ్రష్ అందించిన నేను బ్రహ్మరాక్షసిలా కనిపించాను. నా ముఖం చూడబట్టేగా.... మీకిన్ని కష్టాలు.... రేపే.... రేపే నేను మా వాళ్ళింటికి పోయి.... ఏదన్నా 'జాబ్' చేసుకుంటా. మీరా భానుప్రియతో ఆనందంగా ఉండండి!" అని పెద్ద ఏడుపులు, పెడబొబ్బలు పెడుతుంటే, చేసిన తప్పును తెలుసుకుని, నాలుక కటక్కున కరచుకుని, వసుదేవుడు గాడిదకాళ్ళు పట్టుకున్నట్లుగాక..... శ్రీకృష్ణుడు సత్యభామ పాదాక్రాంతుడైనట్లు పాదాలు తాకాడు.

ఆమె తక్కువ తిందా?

సత్యభామే అయింది. చేతిలో రిమోటు విసింది. అది కొంచెంలో తప్పింది. లేకపోతే కన్నే పోయి ఉండేది! ఈ కేకలకి.. సీతా.., రోజా, ప్రక్కింటి కామేశ్వరరావు, కామాక్షీ వెనకింటి కళ్యాణి.... పక్కింటి పద్మా... ఎదురింటి వెంకయ్యమ్మా... రాట్నం తిప్పుతున్న రవణమ్మా.. చూరుకింద పడుకున్న సుశీల... గడపలో మంచం వేసుకున్న గంగమ్మ.... అప్పుడే వచ్చిన జగన్నాథమ్మా..... దేవకీ జగదాంబ ఒకరేమిటి? ఫ్రీగా సినిమా చూస్తున్నట్టు నిలబడి చూస్తున్నారు.

పావం, వాళ్ళవి రిహార్సులే అనుకుంటున్నారు గానీ... నెలరోజుల ప్రాక్టీసు... వాళ్ళ కమ్మని కాపురంలో పెట్టిన చిచ్చునుకోలేదు.

విషయమంతా విన్న కనకారావు లోకేశ్వరినీ, లోకనాథంనీ చీవాట్లు పెట్టి... అందర్నీ ఇళ్ళకి పోయి పనులు చూసుకొమ్మని.... నవ్వావుకుంటూ ఇంటికొచ్చేసరికి పదిన్నరయింది. నిజానికి తొమ్మిదిన్నరకే రావల్సింది. దారిలో కృష్ణమూర్తి కానిస్టేబులు కలిస్తే.... కథంతా చెప్పినవ్వి, నవ్వి ఫ్రీగా, టీ త్రాగి మిరపకాయ బజ్జీలు తిని ఇంటికొచ్చేసరికి ఆ టైమయింది.

ఇంటికొచ్చేసరికి కనకం.....

"ఏయ్యా! టయం ఎన్ని గంటల యింది?"

"అదికాదే... ఇయ్యాలేటయిందంటే...?" అనబోయేసరికి... ఉరుములూ.... మెరుపులూ లేని... వడగళ్ళవానలా....

"సెప్పకు... హరికతలు సెప్పకు... ఇన్నాళ్ళు..... నువ్వేం సెప్పినా నమ్మాను. నైట్ డూటీలన్నావు. డే డూటీలన్నావు, ఆ పనన్నావు. ఈ పనన్నావు. రాములోర్ని సీతమ్మనాగా... అరిచ్చంద్రుణ్ణి చెంద్రమతి నాగా... నిన్ను నమ్మినాను. నాన్నికేం అన్నేయం సేసినాను. అద్దరాత్రి పన్నెండయినా కోడి కురమా సెయ్యమంట సెయినేదా! బొమ్మిడాల పులుసు ఎట్టమంటే ఎట్టనేదా? ఎందుకయ్యా.. ఇన్ని కల్లబొల్లి కవుర్లు సెప్పినావు?" అంటూ కనకారావు మాట వినకుండా సైరన్‌లాగా శ్రుతి పెంచిన కనకం తీరు అర్థంగాక....

"కనకమా... ఒలే... నన్ను నమ్మే.. నేన్నికెపుడూ... ఏఅన్నాయం సెయ్యనే..."

"ఆ... తెల్సు... మొగుళ్ళ మాటలు నెమ్మొద్దని... ఆటీవీలో ఆయమ్మా సెప్పింది... మొగుళ్ళని దారిలో పెట్టండి సీరియల్ కతలో ఇక నేన్నమ్మనంటే నమ్మను. నమ్మనుగాక నమ్మను!" అని రెచ్చిపోతుంటే...

కనకారావు బ్రహ్మానందం టైపులో తలపట్టుకుని...

"వారి దేవుడోయ్! టీవీలేటి ఇలాటి పాటాలు సెవుతున్నాయి? అసలే మా బతుకులెప్పుడేమవుతాయో తెలీటం లేదు? ఇలగైతే మా కొంపలు కొల్లేరు గావా?" అనుకున్నాడు అయోమయంగా.